కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

బీజేపీ ఆధ్వర్యంలో రైతు హామీల సాధన దీక్ష



రైతు సాధన దీక్షలో పాల్గొన్న ఎంపీ ఈటల, కార్పొరేటర్ సునీత

మౌలాలి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయాలని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీతా యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ ప్రజా ప్రతినిధులు చేపట్టిన రైతు హామీల సాధన దీక్షలో శాసనసభాపక్ష నేతలు మహేశ్వర్ రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావులతో కలిసి కార్పొరేటర్ పాల్గొన్నారు. రైతు భరోసా, రుణమాఫీలను వెంటనే అమలు చేయాలని లేదంటే ప్రజలకు కాంగ్రెస్ మోసపూరిత హామీలపై నిలదీస్తామని హెచ్చరించారు. బీజేపీ నేతలు వెంకటేష్ నేత, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో స్వచ్ఛతా హీ సేవ



కుషాయిగూడలోని జిల్లా కోర్టులో చెత్తను తొలగిస్తున్న న్యాయమూర్తులు

కుషాయిగూడ: స్వచ్ఛత అంశాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించినప్పుడే వంద శాతం స్వచ్ఛత సాధ్యమవుతుందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్ అభిప్రాయపడ్డారు. మంగళవారం కుషాయిగూడలోని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టులో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.రఘునాథ్‌రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జిలు కిరణ్‌కుమార్, మహేష్‌నాథ్, జూనియర్ సివిల్ జడ్జిలు అరుణ్‌తేజ్, చిరాగ్ మోహతా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి కోర్టు ఆవరణలో వ్యర్థాలను తొలగించారు.

మరమ్మతు పనుల పరిశీలన

మల్కాజిగిరి: గాంధీపార్కులోని మరమ్మతు పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీ జయంతి సందర్భంగా పనులను పూర్తి చేస్తున్నామని, దేవీ శరన్నవరాత్రులు గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయని అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేసే మండపాల వద్ద రోడ్ల మరమ్మతులు, శానిటేషన్ ఏర్పాట్లు చేయాలని సూచించామన్నారు. డీఈ మహేష్, ఏఈ నవీన్, వీఐ రమేష్, ఎస్ఎఫ్ఏ గిరి, రవి, నందు, విక్రమ్, సునీల్, మహేష్ పాల్గొన్నారు.



పనులను సమీక్షిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

తాగునీటి సరఫరాకు అంతరాయం



హబ్సిగూడలో డయా పైపులైన్ లీకేజీ

రామంతాపూర్: హబ్సిగూడలోని జెనాక్ట్ రోడ్డులో డయా పైపులైన్ మరమ్మతుల కారణంగా బుధవారం హబ్సిగూడలోని సాయిచిత్రానగర్ కాలనీ, గ్రీన్‌హిల్స్ కాలనీ, దేవి గార్డెన్, మహేశ్వరీనగర్, రామంతాపూర్‌లోని కొన్ని ప్రాంతాలతో పాటు ఉప్పల్ పారిశ్రామికవాడలో నీటిసరఫరా ఉండదని జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. దీనికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

కాప్రా: తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్‌కు అశోక్ ఎన్‌క్లేవ్ కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం కాలనీ పర్యటనకు వెళ్లిన కార్పొరేటర్ స్వర్ణరాజ్, స్థానికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో పార్క్, కమ్యూనిటీహాల్ ఏర్పాటు చేయాలని కోరారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు స్పందించిన కార్పొరేటర్ ఆ దిశగా కృషి చేస్తానని తెలిపారు.



కార్పొరేటర్ స్వర్ణరాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

కాలనీ అధ్యక్షుడు స్వామి, సెక్రటరీ నికేతన్‌రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

చెరువుల కాలుష్యంపై జీహెచ్ఎంసీ నజర్



మల్లాపూర్ వద్ద నీటిని పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని నాచారం హెచ్ఎంటీనగర్, ఉప్పల్ నల్లచెరువు, బోడుప్పల్ చెరువులు పారిశ్రామిక వ్యర్థాలతో కలుషితమవ్వడంపై జీహెచ్ఎంసీ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ ఆదేశాల మేరకు మంగళవారం ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు, కాప్రా సర్కిల్ డీసీ జగన్, ఉప్పల్ ఈఈ హరిలాల్, కాప్రా ఈఈ నాగేందర్, పీసీబీ అధికారి శరత్‌చంద్ర, జలమండలి జీఎం సంతోష్, పారిశ్రామికవాడ ఏఈ ప్రభాకర్‌లు కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఉప్పల్ నల్ల చెరువు, నాచారం పెద్ద చెరువుతో పాటు పలు నాలాలు, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్, మల్లాపూర్ కెమికల్ ఇండస్ట్రీలోని పారిశ్రామిక వ్యర్థాల ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించారు. చెరువుల్లో పారిశ్రామిక వ్యర్థాలు కలుస్తుండటంతో అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువుల్లో వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

యూపీహెచ్‌సీకి ప్రభుత్వ స్థలం పరిశీలన

బోడుప్పల్: అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు (యూపీహెచ్‌సీ) ఏర్పాటు చేసేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు బోడుప్పల్‌లో సోమవారం ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. బోడుప్పల్‌లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం కోసం స్థలం అనుకూలతను ఈ బృందం పరిశీలించింది. అనంతరం ఈ వైద్య బృందం కమిషనర్ రామలింగం కలిసి నగర జనాభాకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సహకారం అందించాలని కోరారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం, మౌలిక వసతులు, నిధులు కేటాయింపు, ఆరోగ్య, మున్సిపల్ శాఖల సమన్వయం, ప్రాజెక్ట్ త్వరగా పూర్తయ్యేందుకు అవసరమైన చర్యలపై చర్చించారు. మేడ్చల్ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ రఘునాథ్ స్వామి, కీసర డివిజన్ ఉప జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి డాక్టర్ సత్యవతి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ మంజులారెడ్డి, వైద్య అధికారిణి డాక్టర్ శోభనా, బస్తీ దవాఖాన అధికారి డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



కమిషనర్ రామలింగంతో చర్చిస్తున్న జిల్లా వైద్యాధికారులు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్‌లో నివాసం ఉండే సతీష్‌కుమార్(40) ఆర్టీఏ ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. అతడికి భార్యతో పాటు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత కొంతకాలం నుంచి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. సోమవారం రాత్రి ఇంట్లో నిద్రకు ఉపక్రమించిన అతడు ఉదయం 9 గంటలైనా గది నుంచి బయటకు రాకపోవడంతో కుటుంబసభ్యులు గది తలుపులు బలవంతంగా తెరిచారు. అప్పటికే గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పు తీర్చాలనే ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకోవచ్చని కుటుంబసభ్యులు భావిస్తున్నారు. మృతుడి సోదరుడు సతీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆనందోత్సాహాలతో బతుకమ్మ సంబరం



బతుకమ్మ వేడుకల్లో చిన్నారులతో కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి

ఉప్పల్,మల్కాజిగిరి జోన్ పరిధిలోని పలు వీధులు, కాలనీలు, పాఠశాలలు, కళాశాలల్లో బతుకమ్మ సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మలను స్వయంగా పేర్చి ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ ఆడుతూ ఉత్సవాలను ఘనంగా జరిపారు. అధ్యాపకులు బతుకమ్మ పూల ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. కాలనీల్లోనూ మహిళలు బతుకమ్మలను తయారు చేసి ఆడారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



బతుకమ్మ వేడుకల్లో జేజీఆర్ స్కూల్ విద్యార్థులు



మేడిపల్లి సరస్వతి ప్లే స్కూల్‌లో..



బాల భారతిలో..



జ్యోతినగర్ కమ్యూనిటీహాల్‌లో..





బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు



ఓల్డ్ అల్వాల్ నారాయణ కళాశాలలో..



విద్యార్థులతో కార్పొరేటర్ బన్నాల గీత

హాకర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

కుషాయిగూడ: హాకర్స్‌ను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని ఈసీఐఎల్ హాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటరమణ, సురేష్ రెడ్డి, అమీద్, నరేష్, దశరథ, సుధాకర్ కోరారు. మంగళవారం హాకర్స్ వారి సమస్యలపై వివరించారు. ఈ వృత్తిని నమ్ముకుని 28 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. గతంతో పోల్చుకుంటే పేపర్ వ్యాపారం దయనీయంగా మారిందని, తప్పని పరిస్థితుల్లో వ్యాపారం చేస్తూ.. జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. హాకర్ల సమస్యను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. సబ్సిడీలో బైక్‌లను ఇప్పించడం, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులతో పాటు మహిళ సంఘాలకు ఇచ్చే విధంగా వడ్డీలేని రుణాలను అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేటి నుంచి బతుకమ్మ సంబరాలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో బుధవారం నుంచి 13వ తేదీ వరకు బతుకమ్మ, దసరా సంబరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. చేనేత హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శనలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మవారి నృత్య ప్రదర్శనలను డాక్టర్ రమాదేవి, ప్రణవి, సాహితీ అజ్జరపు, పద్మశ్రీ, చంద్రశేఖర్ తదితరుల శిష్యబృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

రెండు కిలోలు స్వాధీనం

ఉప్పల్: ఫార్మాలో టాబ్‌లెట్ ప్యాకింగ్ బాయ్‌గా పనిచేసే యువకుడు గంజాయి విక్రేతగా మారాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన బాన్సి ప్రదాన్ కుమారుడు లోక్‌నాథ్ ప్రదాన్ (19) ఫిబ్రవరిలో నగరానికి వచ్చి చిలుకానగర్ బోడ్రాయి ప్రాంతంలో అద్దెకు ఉంటున్నాడు. నాచారం శ్రీకృష్ణా ఫార్మా కంపెనీలో టాబ్‌లెట్ ప్యాకింగ్ బాయ్‌గా చేరాడు. టాబ్‌లెట్ ప్యాకింగ్‌తోనే ఎవ్వరికి అనుమానం రాకుండా గంజాయిని సులభంగా రవాణా చేయొచ్చని నిర్ణయించుకున్నాడు. గత రెండు నెలల క్రితం ఒడిశాకు వెళ్లి అక్కడ 2 కిలోల గంజాయిని కొని ట్యాబ్‌లెట్స్ లాగా ప్యాకింగ్ చేసుకున్నాడు. అదును చూసి బరంపూర్ నుంచి సికింద్రాబాద్‌కు రైలులో గంజాయితో వచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

చెత్తను తొలగించండి

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని వాసవీనగర్ స్ట్రీట్ నెంబర్ 2 లో గత కొన్నేళ్లుగా వాడుకలో లేని చిన్న గృహం ఖాళీ స్థలంలో చెట్లపొదలు, గడ్డి పెరిగిపోయి దోమలు విజృంభించి స్థానికంగా దోమలు వ్యాపించి ప్రజలు అంటు వ్యాధుల భారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ ఖాళీ స్థలంలో ఓ బావి కూడా ఉంది. దాంట్లో కుక్కలు పడి చనిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయన్నారు. దీనిపై జీహెచ్ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకుని ఖాళీ స్థలంలోనే చెత్తను ఎత్తివేసి ఆ బావిని మూసివేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పెంటారెడ్డికాలనీలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ శాంతి



కౌకూర్‌లో..

అల్వాల్: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం అల్వాల్ డివిజన్ పెంటారెడ్డినగర్ కాలనీలో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజర్ కృష్ణమాచారి, ఏఎంహెచ్‌వో రజిని, ఎస్ఎస్ ప్రభాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, శేఖర్, మల్లేష్‌గౌడ్, పోచయ్య, ప్రేమ్, యాదగిరి, సాజిద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

- కౌకూర్‌లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులు మంగళవారం కౌకూర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మణ్‌యాదవ్, తిరుపతిరావు, సురేష్, శ్రీనివాస్, రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అనిల్ కుమార్ (ఫైల్)

ఉప్పల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ వివేక్‌నగర్‌లో నివసించే వనపర్తి రేముద్దుల గ్రామానికి చెందిన బోరోజు సుధాకర్ కుమారుడు బోరోజు అనిల్‌కుమార్ (21) వృత్తిరీత్యా కార్పెంటర్. కాగా సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత స్నేహితుడు శివకుమార్‌తో కలిసి టిఫిన్ చేసేందుకు ద్విచక్ర వాహనం (ఏపీ09బీఏ5811) పై నాగోల్‌కు వెళ్తున్నాడు. మార్గం మధ్యలో ఉప్పల్ జీహెచ్ఎంసీ డంపింగ్ స్టేషన్ వద్దకు చేరుకోగానే వేగంగా వచ్చిన జీహెచ్ఎంసీ లారీ (టీఎస్08యుఎల్ 3467) ఢీకొనడంతో వెనుక కూర్చున్న ఇద్దరు కింద పడ్డారు. ఈ ప్రమాదంలో అనిల్‌కుమార్ పై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శివకుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడల్లో రాణించేందుకు శిక్షణ పొందాలి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకోవాలని బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ దామోదర్ అన్నారు. బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ ఎలక్ట్రికల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు సమగ్రత, సంస్కృతితో దేశ అభ్యున్నతిపై తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌పై ఎస్ఏ రైటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన 28 మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. బెల్ కంపెనీ జనరల్ మేనేజర్లు శ్రీనివాస్, విశ్వనాథ్, ప్రకాష్ రావు, లీలా, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న శ్రీనివాస్

పరామర్శ

కుషాయిగూడ: మాజీ మేయర్ బొంతు రాంమోహన్, బొంతు శ్రీదేవి దంపతులను మంగళవారం మాజీ మంత్రులు హరీష్‌రావు, మహమూద్ అలీ, పరామర్శించారు. వారితో పాటు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్, ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆయనను పరామర్శించి బొంతు కమలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, సాయిజెనోఖర్, శివకుమార్‌గౌడ్, కాసం మహిపాల్‌రెడ్డి, రెగ్గల సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.



బొంతు రాంమోహన్‌ను పరామర్శిస్తున్న హరీష్‌రావు, మహమూద్ అలీ

జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం



అవార్డు గ్రహీత నాగేశ్వర్‌రావును సన్మానిస్తున్న మంత్రి సీతక్క

కాప్రా: ఈశ్వరిపురి కాలనీకి చెందిన నాగేశ్వరరావు జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ వయోవృద్ధుల సంక్షేమశాఖ రాష్ట్ర కమిటీ సభ్యులు, జీహెచ్ఎంసీ ఆసరా సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్న నాగేశ్వర రావు గత దశాబ్దన్నర కాలంగా రాష్ట్రంలో వయోవృద్ధుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. ఈ సేవలను గుర్తించి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు వరించింది.

జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందికి ట్రై సైకిల్స్



ట్రై సైకిల్స్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ సునీతారాముయాదవ్

గౌతంనగర్: మల్కాజిగిరి సర్కిల్ జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందికి మంగళవారం గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతా రాముయాదవ్ చేతుల మీదుగా ట్రై సైకిల్స్, పుష్‌కార్ట్స్‌ని అందజేశారు. సూపర్‌వైజర్ నాగరాజు, గౌతంనగర్ డివిజన్ ఎస్ఎఫ్ఏలు, బీఆర్ఎస్ నేతలు మేకల రాముయాదవ్ పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధితో చిన్నారి పోరాటం



బాధిత చిన్నారి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ అశోక్‌నగర్ కాలనీకి చెందిన ఆదిల్ కుమార్తె అలీషా (05) ప్రాణాంతక వ్యాధితో బాధపడుతోంది. జెనటిక్ సమస్యతో బాధ పడుతున్న పాపకు ఎలాంటి పెరుగుదల లేకపోవడంతో పాటు లివర్ క్రమేనా పెరుగుతుందని వైద్యులు తెలిపారు. ప్రాణాంతక జీవక్రియ వ్యాధి ×గౌచర్ డిజీజ్ టైప్‌౯ ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఎంజైమ్ రీప్లేస్‌మెంట్ థెరపీ, అలోజెనిక్‌స్టెమ్ సెల్‌ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరమని వైద్యులు తేల్చారు. చికిత్స కోసం సుమారు రూ.17 లక్షలు అవసరమని చెప్పడంతో చిన్నారి కుటుంబసభ్యులు కంగుతిన్నారు. పాప తండ్రి గ్లాస్ వర్క్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇప్పటికే చిన్నారితో పాటు కుమారుడు మహ్మద్ అఫ్వాన్ (02) సైతం ఇదే వ్యాధితో బాధపడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు 9652506197.